దిన పత్రిక తొలి సమయం

బుధవారం , 21 - 1 -2026

## జనసేన పార్టీ మండల అధ్యక్షునిగా ఉసికల రమేష్





**జూలూరుపాడు, తొలి సమయం, జనవరి 20 :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల జనసేన పార్టీ అధ్యక్షునిగా అనంతారం గ్రామానికి చెందిన యువ నేత ఉసికల రమేష్ ఎన్నికయ్యారు. హైదరాబాద్, కూకట్ పల్లిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఇటీవల జరిగిన పార్టీ ప్రత్యేక సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ జనసేన పార్టీ ఇంచార్జ శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి భారీగా జనసైనికులు హాజరయ్యారు. మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర నాయకులు ఈ సందర్భంగా జన సైనికులకు విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నియోజకవర్గ కమిటీ నియామకాలను మిరియాల రామకృష్ణకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నియోజకవర్గ కమిటీ నియామకాలను వేముల కార్తీక్ కు అప్పజెప్పారు. ఇందులో భాగంగా జూలూరుపాడు మండల జనసేన అధ్యక్షుడిగా ఉసికల రమేష్ ను ఎన్నుకున్నారు. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి మాట్లాడుతూ పార్టీ పోటీ చేసిన దగ్గర గెలుపు కోసం ప్రతి ఒక్కరూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడుగా ఎన్నికైన ఉసికల రమేష్ మాట్లాడుతూ పార్టీలో ఈ బాధ్యతలను అప్పగించినందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జనసేన పార్టీ ఇంచార్జ వేముల కార్తీక్, ఖమ్మం జిల్లా జనసేన పార్టీ ఇంచార్జ మిరియాల రామకృష్ణ, వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ కట్ల రామకృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, పార్టీ అధిష్టానం ఆదేశానుసారం నడుచుకుంటూ, కార్యకర్తల సమన్వయంతో ముందుకు కొనసాగుతానని తెలిపారు

## విజయవంతంగా ముగిసిన మానుకోట ఉచిత విలువిద్య శిక్షణా శిబిరం






**తొలిసమయం, మహబూబాబాద్, జనవరి 18 :**
మానుకోట పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శ్రీ సాదుల ముత్తయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహించిన ఉచిత విలువిద్య (ఆర్చరీ) శిక్షణ శిబిరం విజయవంతంగా, ఘనంగా ముగిసింది. గ్రామీణ యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడం, క్రమశిక్షణ, ఏకాగ్రతను అలవర్చడం, సరైన మార్గనిర్దేశం అందించడం ప్రధాన లక్ష్యంగా ఈ శిబిరం నిర్వహించబడింది. శిబిరం ముగింపు కార్యక్రమానికి పట్టణ డీఎస్పీ శ్రీ ఎన్. తిరుపతి రావు ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పొందిన యువ క్రీడాకారులను అభినందించారు. గ్రామీణ ప్రాంత యువత కూడా క్రీడా రంగంలో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. విలువిద్య అభివృద్ధికి తన వంతు సహకారంగా ఒక ఆర్చరీ బోర్డును స్పాన్సర్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ అధ్యక్షులు సాదుల సారంగపాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూగ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, క్రీడల అభివృద్ధి, సామాజికంగా బలహీన వర్గాల ఉద్ధరణ లక్ష్యంగా ట్రస్ట్‌ను స్థాపించామని తెలిపారు. పేద విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ, నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం వంటి అనేక సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో సానుకూల మార్పులు తీసుకువస్తున్నామని వివరించారు. ఆల్ ఇండియా ఆర్చరీ అసోసియేషన్ ఆర్చరీ డెవలప్‌మెంట్ బోర్డు సభ్యులు పుట్ట శంకరయ్య ప్రత్యేక అతిథిగా పాల్గొని, విలువిద్యలో ఉన్న అవకాశాలు, భవిష్యత్తులో యువతకు లభించే క్రీడా అవకాశాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సాదుల సురేష్, రఘువీర్, ఉపేందర్, జయంత్, పట్టణ ప్రముఖులు శ్రీరంగం మురళీకృష్ణ, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పొందిన యువత ప్రదర్శించిన విలువిద్య ప్రదర్శనలు ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. గ్రామీణ క్రీడాభివృద్ధికి దోహదపడే ఈ శిబిరాన్ని స్థానికులు, తల్లిదండ్రులు విశేషంగా అభినందించారు. మానుకోట జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు ఎదగాలంటే తల్లిదండ్రులు, విద్యాసంస్థలు పిల్లలను ప్రోత్సహిస్తూ అవసరమైన క్రీడా సౌకర్యాలు, సామగ్రి అందించాల్సిన అవసరం ఉందని వక్తలు తెలిపారు. ప్రజాప్రతినిధులు కూడా క్రీడల అభివృద్ధికి వ్యవస్థాగత ఏర్పాట్ల కోసం కృషి చేయాలని కోరారు. ఆర్చరీ క్రీడాభివృద్ధి, పిల్లల భవిష్యత్తు కోసం తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని సాదుల సారంగపాణి మరియు పుట్ట శంకరయ్య తెలిపారు